దరఖాస్తుల స్వీకరణలో అయోమయం

అవగాహన లేక ప్రజలకు అవస్థలు

సమాధానాలు లేక చేతులెత్తేసిన అధికారులు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 28 : రాష్ట్ర ప్రభుత్వం అభయాస్తంలో భాగంగా ఆరు గ్యారంటీ పథకాలకు లబ్ధిదారులకు ఎంపికలో భాగంగా చేపట్టిన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం జోరుగా సాగుతుంది. కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల పరిధిలోని 11 వార్డులలో 44 కేంద్రాలలో చేపట్టిన దరఖాస్తుల స్వీకరణలో అధికారులకు అవగాహన లేక.. ప్రజలకు వచ్చే సందేహాలను నివృత్తి చేయడంలో అవస్తలు పడ్డారు. జంట సర్కిళ్ల పరిధిలో కొన్ని సెంటర్ల వద్ద ప్రజలు బారులు తీరగా మరికొన్ని సెంటర్ల వద్ద జనాల హడావిడి కనిపించలేదు. సరైన అవగాహన లేకపోవడం వల్ల నిర్దేశించిన కాలనీల ప్రజలు దరఖాస్తులు చేయడానికి ముందుకు రాలేదని తెలుస్తుంది.

- ప్రభుత్వం సూచించిన విధంగా ఇంటింటికి దరఖాస్తులు రాక ప్రజలు ఇబ్బందులు పడగా కేంద్రాల వద్ద అధికారులను అడిగినా సరైన సమాచారం ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. చివరకు జిరాక్స్ సెంటర్ల వద్ద దరఖాస్తుల కోసం తాకిడీ పెరగడంతో ఇదే అదనుగా వారు ఒక్కో దరఖాస్తుకు రూ.50 నుంచి 100 వరకు వసూళ్లు చేశారు.
- దరఖాస్తు ఫారంతో జత చేయాల్సిన సర్టిఫికెట్లుగా ఆధార్‌కార్డు, ఫుడ్ సెక్యూరిటీ కార్డు (రేషన్‌కార్డు) తప్ప నిసరి కావడంతో.. రేషన్‌కార్డు లేని పేదలంతా దరఖాస్తు ఎలా చేయాలని బాధపడుతున్నారు.
- ఫుడ్ సెక్యూరిటీ కార్డు కోసం దరఖాస్తు ఫారంలు అందుబాటులో లేకపోవడంతో తెల్లకాగితంపైన దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- అభయహస్తం దరఖాస్తు ఫారంలు కేవలం తెలుగులోనే ఉండగా.. ఇంగ్లిష్, ఉర్దూ, హిందీ మాధ్యమాలలో దరఖాస్తులు ఇవ్వాలని కోరుతున్నారు.
- దరఖాస్తు చేయడానికి ఆన్‌లైన్‌లో అవకాశం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.
- ఆయా సెంటర్ల వద్ద కాంగ్రెస్ పార్టీల నేతలు కండువాలు కప్పుకుని హడావిడి చేశారు. ప్రజలు వారిని చూసి ఇది రాజకీయం కాదుకదా.. కండువాలు ఎందుకంటూ ప్రశ్నలు సందించారు.

కేపీహెచ్‌బీ కాలనీ వార్డు కార్యాలయంలో దరఖాస్తులను అందిస్తున్న మహిళలు

ప్రజాపాలన అంతంత మాత్రంగానే స్పందన...

దుండిగల్,డిసెంబర్28: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో గురువారం ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభమైంది. ప్రభుత్వం ఆరుగ్యారంటీలకు అమలుకోసం ప్రజలనుంచి ధరకాస్తులు స్వీకరించేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం జనవరి 6వ తేదీవరకు కొనసాగనుంది. ప్రధానంగా ఇందుకోసం నియోజకవర్గం పరిధిలోని కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిల్ పరిధిలోని 8 డివిజన్‌లల్లో 32 దరఖాస్తు కేంద్రాలను ఏర్పాటు చేయగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని డివిజన్‌కు ఒకటి చొప్పున 33 కేంద్రాలు, దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో 28 కేంద్రాలు, కొంపల్లిమున్సిపాలిటీ పరిధిలో 18 కేంద్రాలను ఏర్పాటు చేయగా ప్రజల నుండి మిశ్రమస్పందన లభించింది. పలు చోట్ల స్పందన అంతంత మాత్రంగానే ఉంది.

అధికారులకు అవగాహన అంతంతే...

ప్రజాపాలన, ఆరుగ్యారంటీల అమలు ధరఖాస్తుకు సంబంధించిన విషయమై ధరఖాస్తు కేంద్రాలలోని అధికారులకు అవగాహన అంతంతమాత్రంగా ఉన్నట్లు తెలుస్తున్నది. దరఖాస్తు దారులు పారం తీసుకున్న అనంతరం దానిని నింపి తెలుపురంగు రేషన్ కార్డు జిరాక్స్ ప్రతితో పాటు కుటుంబ యజమాని ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతిని జత చేసి అధికారులకు అందజేయాల్సి ఉంటుంది. అయితే ఈ విషయంలో అధికారులు దరఖాస్తు కేంద్రానికి వచ్చిన ప్రజలకు స్పష్టతను ఇవ్వకపోవడంతో గందరగోళం నెలకొంది. 33వ డివిజన్ ఇంద్రన్న కాలనీలో ఉదయం 9గంటల వరకు ప్రజాపాలన ధరఖాస్తుల స్వీకరణ కేంద్రం ప్రారంభం కాకపోవడంతో ప్రజలు వెనుదిరగాల్సి వచ్చింది. అదేవిధంగా కుత్బుల్లాపూర్ సర్కిల్, సుభాశ్‌నగర్ డివిజన్ పరిధి, శుభాశ్‌నగర్ వార్డు కార్యాలయం వద్ద సైతం గంట ఆలస్యంగా కేంద్రం ప్రారంభమైంది. మరో వైపు కుత్బుల్లాపూర్ డివిజన్‌లోని పద్మానగర్ ఫేజ్-2 వద్ద ఏర్పాటు చేసిన దరఖాస్తుల స్వీకరణ కేంద్రం వద్ద ప్రజాపాలన దరఖాస్తులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జిరాక్స్ సెంటర్లకు క్యూ కట్టారు. అధికారుల తీరును నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు కేఎం.ప్రతాప్ కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేశారు.

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ రామాలయం వద్ద ఏర్పాటు చేసిన కేంద్రం వద్ద జనంలేక వెలవెలబోతున్న ప్రజాపాలన దరఖాస్తు కేంద్రం

దరఖాస్తుల స్వీకరణ

మియాపూర్,డిసెంబర్ 28 : వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్ కాలనీ డివిజన్‌లలో ఆరు గ్యారంటీల పథకాలకు దరఖాస్తుల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. తమ డివిజన్‌లోని పలు కేంద్రాలను కార్పొరేటర్లు మాధవరం రోజాదేవి,నార్నె శ్రీనివాస్‌రావు, దొడ్ల వెంకటేశ్ గౌడ్‌లు పరిశీలించారు. దరఖాస్తు ప్రక్రియను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని వారు పేర్కొన్నారు. వచ్చే నెల 6 వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందన్నారు.

- అల్లాపూర్,డిసెంబర్28 అల్లాపూర్ లో ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పథకాలలో భాగంగా చేపట్టిన ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం గురువారం అల్లాపూర్ లో ప్రారంభమైంది.
- బాలానగర్, డిసెంబర్ 28 : ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలు అయోమయానికి గురయ్యారు. వందమందికి ఒక సెంటర్ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ఓ పక్క ప్రకటించినా సరైన మార్గదర్శకాలు లేకపోవడం కారణంగా అధికారులు ఆ దిశగా ఏర్పాట్లు చేయకపోవడం వలన ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కావాల్సిన దరఖాస్తు ఫారాలు అందుబాటులో లేకపోవడం కారణంగా ప్రజలు జిరాక్స్ సెంటర్లను ఆశ్రయించాల్సిన అవసరం ఏర్పడింది. ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట మోడల్‌మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన సెంటర్ల వద్ద ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

ఫుడ్ సెక్యూరిటీ కార్డు తప్పనిసరి కాదు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 28 : ప్రభుత్వ 6 గ్యారంటీల పథకాల అమలులో భాగంగా చేపట్టిన దరఖాస్తుల స్వీకరణకు ఫుడ్ సెక్యూరిటీ కార్డు (తెల్లరేషన్ కార్డు) తప్పనిసరి కాదనిన అర్హులైన పేదలందరూ దరఖాస్తు చేసుకోవచ్చని మూసాపేట సర్కిల్ నోడల్ ఆఫీసర్ రాజేంద్రప్రసాద్ నాయక్ అన్నారు. గురువారం సర్కిల్ పరిధిలో దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను నోడల్ ఆఫీసర్ రాజేంద్రప్రసాద్ నాయక్, కూకట్‌పల్లి జడ్సీ వి.మమతలు పరిశీలించారు.

దరఖాస్తుల స్వీకరణ.. కార్పొరేటర్ల పరిశీలన..

కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, బాలాజీనగర్ డివిజన్లలో అభయాస్తం గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, మందడి శ్రీనివాస్‌రావు, పగుడాల శిరీషాబాబురావులు పరిశీలించారు.

కేపీహెచ్‌బీ కాలనీలో దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న నోడల్ ఆఫీసర్ రాజేంద్రప్రసాద్ నాయక్

పాండురంగానగర్‌లో కేంద్రాన్ని పరిశీలిస్తున్న హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్ డైరెక్టర్ అలుగు వర్షిణి, జడ్సీ వి.మమత. డీసీ రమేశ్, కార్పొరేటర్ మహేందర్

- మూసాపేట, డిసెంబర్28: రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ఆభయహస్తం ఆరు గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ గురువారం ప్రారంభమైంది. మూసాపేట డివిజన్ పరిధిలో మోతినగర్, మూసాపేట, పాండురంగానగర్, జనతానగర్ లలో కౌంటర్లు ఏర్పాటు చేశారు. పాండురంగానగర్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని హ్యాండ్లూమ్, టెక్సటైల్ డైరెక్టర్ అలుగు వర్షిణి (ఐఏఎస్), జోనల్ కమిషినర్ మమత, మూసాపేట డీసీ రమేశ్, మూసాపేట డివిజన్ బీజేపీ కార్పొరేటర్ కొడిచర్ల మహేందర్ పరిశీలించారు.

కుత్బుల్లాపూర్‌లో తొలిరోజు 26,096 దరఖాస్తులు

దుండిగల్,డిసెంబర్28: ఆరు గ్యారంటీల అర్హులను గుర్తించేందుకు ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం ద్వారా కౌంటర్‌లను ఏర్పాటు చేసి ప్రజలనుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నది. గురువారం కార్యక్రమం తొలిరోజునే కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో ప్రజల నుంచి మొత్తం 20వేల96 దరఖాస్తులు ధాఖలయ్యాయి. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. గాజులరామారం సర్కిల్ పరిధిలో 10436, కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో 8,239, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 3076, దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో 2751, కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో 1588 దరఖాస్తులు ఉన్నాయి. కాగా ఇందులో 10శాతానికి పైగా నూతన రేషన్‌కార్డుల కోసం అర్జీపెట్టుకున్న దరఖాస్తులు ఉండటం గమనార్హం.

- జీడిమెట్ల డివిజన్, గాయత్రినగర్ వార్డు కార్యాలయం ఏర్పాటు చేసిన ప్రజాపాలన ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ సందర్శించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతిసంక్షేమ పథకానికి అర్హులైన ప్రతిఒక్కరు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీలు మల్లయ్య, నాగరాణి పాల్గొన్నారు.
- దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లంపేటలో ప్రజాపాలన కేంద్రాన్ని చైర్‌పర్సన్ సుంకరి క్రిష్ణవేణి కృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శంభీపూర్‌కృష్ణ, అర్కల అనంత స్వామి, మాదాసు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

గాయత్రినగర్‌లో ప్రజాపాలన కేంద్రం వద్ద మహిళ నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

జగద్గిరిగుట్టలో పుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

జగద్గిరిగుట్ట,డిసెంబర్28: రహదారులను ఆక్రమిస్తూ దుకాణాలు ఏర్పాటు చేసుకుంటే చర్యలు తీసుకుంటామని జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. జగద్గిరిగుట్ట ఔట్‌పోస్టు నుంచి ఆల్విన్ కాలనీ వరకు మెయిన్‌రోడ్డులో గురువారం పుట్‌పాత్‌ఆక్రమణలు సిబ్బందితో తొలగింపులు చేపట్టారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ మృతి

దుండిగల్, డిసెంబర్ 28: రోడ్డు దాటుతున్న గుర్తుతెలియని మహిళను వేగంగా దూసుకువచ్చిన కంటైనర్ లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళను చికిత్స కోసం వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో తుదిశ్వాస విడిచింది. ఈ సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 45-50 ఏండ్ల మధ్య వయస్సున్న గుర్తుతెలియని మహిళ గురువారం మధ్యాహ్నం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని గండిమైసమ్మ చౌరస్తావద్ద బొరంపేట్ వైపు నుంచి మేడ్చల్ వైపు నడుచుకుంటూ రోడ్డుదాటుతుండగా సూరారం వైపునుంచి మేడ్చల్ వైపు వేగంగా దూసుకువచ్చిన కంటైనర్ లారీ వెనుకనుంచి ఢీ కొట్టింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రురాలిని అంబులెన్స్‌లో చికిత్స కోసం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. కాగా మృతురాలు యాచకురాలిగా బావిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య

బాలానగర్, డిసెంబర్ 28 : ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన బాలానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కె. భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం...మహారాష్ట్ర-కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో నివాసముండే సోమనాథ్ (29) బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చారు. ఆరు నెలల క్రితం బాలానగర్ డివిజన్ వినాయక్‌నగర్‌లో దంపతులిద్దరు నివాసముంటున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

ఆర్టీసీ బస్సుకు బొలేరో అడ్డుపెట్టి..

కండక్టర్, డ్రైవర్‌పై దాడి చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

దుండిగల్, డిసెంబర్ 28: ఆర్టీసీ బస్సు ఎదుట బొలేరో వాహనాన్ని అడ్డుపెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు బస్సులోకి ప్రవేశించి కండక్టర్, డ్రైవర్లను చితకబాదిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... జగద్గిరిగుట్టలోని మగ్ధూంనగర్‌కు చెందిన కోనపురం మల్లికార్జున్ జీడిమెట్ల బస్‌డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి 11:30 గంటల సమయంలో రూట్‌నంబర్ 272 బస్సును తీసుకొని గండిమైసమ్మ నుంచి జీడిమెట్ల డిపోకు వెళ్తున్నాడు. బహదూర్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్దకు చేరుకోగానే అకస్మాత్తుగా వెనుక నుంచి దూసుకొచ్చిన దుండగులు.. బొలేరో వాహనాన్ని ఆర్టీసీ బస్సుకు అడ్డుగా నిలిపారు. దీంతో బస్సును నిలిపివేయడంతో పాటు బస్సులోకి ప్రవేశించిన ఏడుగురు గుర్తుతెలియని వ్యక్తులు డ్రైవర్ మల్లికార్జున్‌పై దాడి చేశారు. అడ్డుకోబోయిన కండక్టర్ లక్ష్మయ్యపై కూడా చేయి చేసుకున్నారు. మల్లికార్జున్ గురువారం దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును ప్రారంభించారు.

కార్మికుడికి పరిహారం అందజేత

జగద్గిరిగుట్ట,డిసెంబర్28 : ఫ్యాక్టరీల యజమానులు కార్మికుల భద్రతకు తగిన ఏర్పాట్లు చేయాలని కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ సూచించారు. రంగారెడ్డినగర్లోని ఓపరిశ్రమలో రాజు అనే కార్మికుడు ఇటీవల పనిచేస్తుండగా యంత్రంలో చేయి పడి నాలుగు వేళ్లు తొలగించారు. విషయం తెలుసుకున్న స్థానిక నేతలు కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన యాజమాన్యంతో మాట్లాడి రూ. 3లక్షలు పరిహారం ఇప్పించారు. దానిని గురువారం బాధితుడికి అప్పగించారు.